క్లుప్తంగా

వైభవంగా రామలింగేశ్వరస్వామి కల్యాణం



అత్తోట(కొల్లిపర): మండలంలోని అత్తోట శివాలయంలో మంగళవారం రాత్రి శ్రీరామలింగేశ్వరస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పీటలపై దండా రాఘవయ్య, దండా వెంకటేశ్వరరావు దంపతులు కూర్చున్నారు. ఆలయ చైర్మన్ దండా సాంబశివరావు, కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదానం నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు నందివెలుగు భాస్కరరావు, నందివెలుగు కోటేశ్వరరావు గ్రామస్తులు బొల్లిముంత శంకరరావు, చందు సాంబశివరావు, తుల్లిమిల్లి రత్నమాణిక్యం, యర్రు సూర్యనారాయణ, కటికి గోపీచంద్, పెద్దబ్బాయి, పోలిశెట్టి గోపి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ



తెనాలి అర్బన్: శ్రీశైల భక్త సేవా సమితి తెనాలి వారి ఆధ్వర్యంలో ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్లను బుధవారం కొత్తపేటలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఆళ్ల వెంకట సుబ్బయ్య, సభ్యులు పరిమి గోవర్ధన్, కె.బి.ఎస్.గుప్త, కొడాలి భారతి, జి.వి.నాగ సుధాకర్ పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు వెంకటేశ్వరరావుకు సన్మానం



తెనాలి అర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో బుధవారం రక్తసంబంధం చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గురువారం సాహసవంతుడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం పౌరాణిక నాటక కళాకారుడు ఎస్. వెంకటేశ్వరరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, సోమువరపు సాంబశివరావు, ఈదర శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, ముళ్లపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్, పెద్దిటి యోహాన్, వరికూటి సోమయ్య, దేవరపల్లి భవాని, దాసరి నరసయ్య, వినుకొండ శ్రీరామమూర్తి, తరణి హేమంత్, పఠాన్ అల్లాభక్షు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నేత రత్నకిషోర్ మృతి



రత్నకిషోర్ (ఫైల్)

తెనాలి: విశ్రాంత ఉద్యోగి, సీపీఎం సీనియర్ నాయకుడు మాతంగి రత్నకిషోర్ (73) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందిన ఆయన కొద్దిరోజుల కిందట స్వగ్రామం చేరుకుని మంగళవారం మృతి చెందారు. రూరల్ మండలం గుడివాడకు చెందిన రత్నకిషోర్ సుదీర్ఘకాలంలో సీపీఎం తెనాలి తాలూకా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. ఏలూరులో ఉద్యోగంలో ఉన్నపుడు మధ్యతరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులుగానూ చురుకైన పాత్ర పోషించారు. సీపీఎం ఉద్యమ కార్యాచరణలో కీలకంగా పనిచేసినట్టు పార్టీ సీనియర్ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. గతంలో గ్రామసర్పంచ్‌గా పోటీచేసిన కేవలం 30 ఓట్ల తేడాతో ఓటమి చెందారని తెలిపారు. సాంబిరెడ్డితోపాటు సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పట్టణ కార్యదర్శి కె.బాబూప్రసాద్, వల్లభనేని సాంబశివరావు, జ్యోతుల కోటేశ్వరరావు, తుమ్మపూడి మాజీ సర్పంచ్ వీఎస్ ప్రసాద్, కంచర్లపాలెం మాజీ సర్పంచ్ చుక్కపల్లి ప్రభాకరరావు సంతాపం తెలియజేశారు.

హనుమాన్ చాలీసా పారాయణ ప్రారంభం

జంపని(వేమూరు): జంపని వీరాంజనేయ స్వామి ఆలయంలో వార్షిక మండల దీక్ష హనుమాన్ చాలీసా పారాయణం బుధవారం ప్రారంభించారు. నిత్యం నిర్వహించే ఈ సామూహిక చాలీసా పారాయణం మే నెల 14న హనుమజ్జయంతి పర్వదినం వరకు కొనసాగుతుందని అర్చకులు శ్రీనివాస మూర్తి తెలిపారు. తొలిరోజు పారాయణలో వీరాంజనేయ భక్త సమాజం, తిరుమల తిరుపతి దేవస్థాన దాస సాహిత్య ప్రాజెక్ట్ భజన మండలి, శ్రీ హనుమాన్ యువజన భక్త సమాజం, సీతారామాంజనేయ భక్తి సమాజాల సభ్యులు పాల్గొన్నారు.

దేశానికి జగ్జీవన్ సేవలు మరువలేనివి

- తెనాలి పట్టణంలో పలుచోట్ల ఘనంగా జయంతి
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి



రైల్వేస్టేషను సమీపంలో జగ్జీవన్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

తెనాలి: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన జాతీయ నాయకుడు బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్లమెంటేరియన్‌గా, ఉప ప్రధానిగా సుదీర్ఘకాలం దేశానికి అందించిన సేవలు నిరుపమానమని పేర్కొన్నారు. బలహీనవర్గాలకు రాజ్యాధికారం, విద్యాహక్కును ఆయన కోరుకున్నారని, ఆ దిశగానే ఎన్నో విలువైన సేవలను అందించారని చెప్పారు. జగ్జీవన్‌రామ్ 115వ జయంతిని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అయితానగర్‌లోని లింగారావు సెంటర్లో గల కాంస్య విగ్రహానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలసి పుష్పాంజలి ఘటించారు. నిర్వాహకుల తరపున అక్కడ స్థానికులకు మజ్జిగ పంపిణీ చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలతోపాటు జ్యోతిబా పూలే, పూజ్య బాపూజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన చేస్తున్న సీఎం కేవలం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కౌన్సిలరు అత్తోట నాగవేణి, అత్తోట చంటి, కొమ్ము రాయల్, కాకి దేవసహాయం, అక్కిదాసు కిరణ్‌కుమార్, స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

గుర్రం జాషువా విజ్ఞానసమితి ఆధ్వర్యంలో..

పట్టణానికి చెందిన గుర్రం జాషువా విజ్ఞానసమితి ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని బుధవారం స్థానిక రైల్వేస్టేషను వద్ద నిర్వహించారు. అక్కడ ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, అక్కడే బహిరంగ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హాజరై జగ్జీవన్‌రామ్ పుష్పాంజలి ఘటించారు. విజ్ఞాన సమితి కార్యదర్శి పినపాటి రవికుమార్ అధ్యక్షత వహించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున న్యాయ సలహాదారుగా నియమితులైన గుంటూరు కృష్ణను ఇదే వేదికపై ఎమ్మెల్యే సత్కరించారు. సాంఘిక సంక్షేమశాఖ కేంద్ర సలహామండలి మాజీ సభ్యురాలు అరుగొలను జాస్మిన్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, డెప్యూటీ డైరెక్టర్ ప్రాసిక్యూషన్స్ (కర్నూలు) ఉన్నం ఎహేస్కేల్, సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుద్దపల్లి సుకుమార్, జుజ్జవరపు న్యూటన్, న్యాయవాది ఇందుపల్లి రాజారామ్, చంపాడు సర్పంచ్ రత్నకుమారి, ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, మట్లపూడి రాజేశ్వరరావు, దేవరపల్లి వీరయ్య, అత్తోట చంటి, కఠెవరపు దేవయ్య, అక్కిదాసు కిరణ్ ప్రభృతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో...

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ దగ్గర్లోని అంబేడ్కర్ సేవా ట్రస్ట్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంబేడ్కర్ చైర్ డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్, దుబా సందీప్, పముల దాసు, అమర్తలూరి రాంబాబు, కంచర్ల ప్రభుదాస్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

సమతావాది జగ్జీవన్

తెనాలి టౌన్ : సమతావాదిగా, ఉప ప్రధానిగా దేశానికి జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరులో ప్రధాన సెంటర్‌లో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద బుధవారం జయంతి వేడుకలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు కొలకలూరి నాగేశ్వరరావు, చిన్నపాటి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, జీడీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు చక్కా సీతమ్మ, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ కె.రాజమోహన్, మల్లవరపు బుల్లియ్య, పామర్తి సుబ్బారావు పాల్గొన్నారు. దళితవాడలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ పాల్గొన్నారు.

జగ్జీవన్ సేవలు శ్లాఘనీయం

తెనాలి అర్బన్: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతిని తెనాలి పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహాలకు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవల్ని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని సంస్థ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు మరువరానివన్నారు. ఆయన తపాలా, రైల్వే, సమాచార శాఖల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. రాజ్యాంగ నిర్మాణంలోనూ ఆయన పాత్ర మరువరానిదని తెలిపారు. ఆయన ఆశయాల్ని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సొపాటి కిరణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకా కిరణ్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనీల్, మొఘల్ అహ్మద్ బేగ్, ఐక్యవేదిక ప్రతినిధులు జూపల్లి వంశీ, దేవరకొండ శంకరరావు, చావలి జగదీష్, యనమద్రి శ్యామ్, ఇస్మాయేల్ పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు ఆధ్వర్యంలో అయితానగర్‌లోని జగ్జీవన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన భారత ప్రధానిగా దేశానికి అందించిన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో పొన్నూరు నాగసూర్యశశిధరరావు, పినపాటి స్టీవెన్‌బాబు, మేకల చిట్టిబాబు పాల్గొన్నారు.
- అంగలకుదురు గ్రామపరిధి సజ్జనపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజ్యలక్ష్మి, నలుకుర్తి విజయ, చిలకా ప్రసాదరావు, జంపని విజయరాజు, కూచిపూడి రాజేశ్వరరావు, మున్నంగి నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- జగ్జీవన్‌రామ్ జయంతిని బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు షేక్ బాషా, వేజండ్ల మంగయ్య, దళిత సంక్షేమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తమనం భూషణం పాల్గొన్నారు.
- రైల్వే స్టేషన్ రోడ్డులోని జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి బీసీ సంక్షేమ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సుద్దపల్లి నాగరాజు, వెంకటేశ్వరరావు, జాస్మిన్ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘ నేతలు



సజ్జనపేటలో దళిత నాయకుల నివాళి



అంబేడ్కర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పుష్పాంజలి

7 నుంచి 'జగనన్నే మా భవిష్యత్'



పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

తెనాలి: ప్రజలతో మమేకమయ్యే మరో భారీ కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకారం చుట్టింది. 'జగనన్నే మా భవిష్యత్' పేరుతో ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమ పోస్టర్లను తెనాలిలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. స్థానిక గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలన ఒక సువర్ణ అధ్యాయంగా చెప్పారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజల జీవన ప్రమాణాల్ని పెంచేందుకు పలు సంక్షేమ పథకాల్ని అమలు చేస్తూ నేరుగా డబ్బుల్ని వారి ఖాతాల్లో జమ చేస్తున్నారని గుర్తుచేశారు. ఈ క్రమంలో పార్టీ తరపున నూతనంగా ఏర్పాటుచేసిన సచివాలయ కన్వీనర్లు, వారి తర్వాత స్థాయిలో పనిచేసే గృహసారథుల నియామకం తర్వాత తొలిసారిగా ప్రజలతో మమేకమయే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఈనెల 7-20 తేదీల్లో 'జగనన్నే మా భవిష్యత్' పేరుతో వీరంతా ప్రజల్ని కలుస్తారని చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో గత ప్రభుత్వాలకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు రాజకీయ పార్టీ కార్యకర్తలుగానే కాకుండా ప్రజల అవసరాలను తీర్చే బాధ్యతాయుత వ్యవస్థగా పని చేస్తారని వివరించారు. ప్రతిపక్షాల పేరుతో వికృత చేష్టలకు ఒడిగొట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ రథానికి అడ్డుపడే ప్రయత్నాలు, కుట్రలు చేస్తున్న శక్తులకు పార్టీ కార్యక్రమం తగిన గుణపాఠం చెబుతుందని అన్నారు. ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. పట్టణ పరిధిలో 1-20 వార్డుల వరకు కౌన్సిలరు తాడిబోయిన రామయ్య, 21-40 వార్డుల పరిధిలో ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ ఈ కార్యక్రమ కన్వీనర్లుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. పోస్టరు ఆవిష్కరణలో తాడిబోయిన రామయ్యతోపాటు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, అక్కిదాసు కిరణ్‌కుమార్, సిరికృష్ణ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు దిక్సూచి మన ప్రకృతి వ్యవసాయం

- ఈ పరిజ్ఞానాన్ని విదేశాలకు తీసుకెళ్లనున్న ప్రకృతి రైతులు
- ప్రకృతి వ్యవసాయమే వాతావరణ అత్యవసర పరిస్థితికి విరుగుడు
- ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయకుమార్



ఫ్రాన్స్ బృందం, ప్రకృతి రైతులు, సిబ్బందితో టి.విజయకుమార్, రాజకుమారి

తెనాలి: ప్రపంచ దేశాలకు మన ప్రకృతి వ్యవసాయం దిక్సూచి కానుంది...ఇప్పటికే ఎన్నో దేశాల్నుంచి పలు బృందాలు వచ్చి, ఇక్కడ అనుసరిస్తున్న వ్యవసాయ పద్ధతుల్ని అధ్యయనం చేస్తున్నాయి... తమ దేశాల్లోనూ శిక్షణనివ్వాలని అభ్యర్థిస్తున్నాయి.. ఈ క్రమంలో ఆర్నెల్లలో మనరైతులు ఈ పరిజ్ఞానాన్ని విదేశాలకు తీసుకెళ్లనున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయకుమార్ చెప్పారు. ఫ్రాన్స్‌కు చెందిన కమ్యూనికేషన్ గ్రూప్ బుధవారం ఆయన్ను, ప్రకృతి రైతుల్ని కలిసింది. గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని అత్తోటలో పంటల జీవవైవిధ్యానికి చిరునామా అయిన నామని రోశయ్య వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయంతో రైతులు ఏవిధమైన మార్పు తీసుకొచ్చారు ఎలాంటి ప్రయోజనం పొందుతున్నారు ప్రభుత్వం ఏరకంగా ప్రోత్సాహాన్ని ఇస్తోంది అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవటానికి ఎలా దోహదపడుతుందనే అంశాన్ని ప్రశ్నించారు. అనంతరం టి.విజయకుమార్ 'సాక్షి'తో మాట్లాడారు. ఒకే భూమి ఒకే పంట అనే విధానాన్ని విడనాడి, ఒక భూమిలో 30 రకాల పంటలు పండించటం వల్ల పంటల జీవవైవిధ్యం సాధ్యపడుతుందని చెప్పారు. రెండో పంట తీయగానే ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిలో 30 రకాల విత్తనాలను చల్లటంలోని ఆంతర్యం ఇదేనన్నారు. ఫలితంగా భూమిలో సేంద్రియ కర్బనం భారీగా పెరుగుతుంది. ఏడాది పొడవునా భూమిపై పచ్చదనం, భూమి ఆరోగ్యంగా బాగుండటంతో ఆహారంలో పోషకాల సాంద్రత అధికంగా ఉంటుందన్నారు. అన్నిటికీ మించి ప్రకృతి పద్ధతిలో నీరు ఆదా అవుతుందని విజయకుమార్ తెలిపారు.

ప్రకృతి వైపరీత్యాలకు విరుగుడు...

ముఖ్యంగా వాతావరణ శాస్త్రవేత్తలు మన విధానంపై చాలా ఆసక్తిని కనబరుస్తున్నారని తెలిపారు. రానున్న 30 ఏళ్లలో ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతాయన్న అధ్యయనాలు ఉన్నాయని గుర్తుచేస్తూ, వాటన్నిటికీ విరుగుడు ప్రకృతి విధానాలను అనుసరించటమేనని స్పష్టంచేశారు. ఆ మెకానిజం ప్రకృతి వ్యవసాయంలో ఉందని నమ్మి, ఇన్ని దేశాలు మన దగ్గరకు వస్తున్నాయని, ఇది మనం సాధించిన విజయంగా చెప్పారు. వీరితో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజరు రాజకుమారి, ప్రకృతి రైతులు యర్రు బాపారావు, నామని రోశయ్య, రామకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే ప్రకృతి రైతులు విదేశాలకు...

రాష్ట్రంలో అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ఇప్పటికి 12 రాష్ట్రాల ప్రతినిధులు పరిశీలించగా, మధ్యప్రదేశ్‌తో ఒప్పందం జరిగిందన్నారు. త్వరలోనే మన రాష్ట్ర ప్రకృతి రైతులు అక్కడకు వెళ్లి, ఆ రైతులకు శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. మేఘాలయ, రాజస్థాన్ రాష్ట్రాలతోనూ ఒప్పందాలు జరుగుతున్నాయని, వచ్చే ఆర్నెల్లలో జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, హరియాణాలో ఒప్పందాలకు అవకాశం ఉందన్నారు. ఇండోనేషియా నుంచి వారం క్రితమే ఒక బృందం ఇక్కడకొచ్చిందని గుర్తుచేశారు. ఇథియోపియా, రువాండా, దక్షిణ అమెరికాలోని అండూరస్, ఈక్వెడార్‌కు చెందిన సంస్థలతో మాట్లాడుతున్నాం. త్వరలోనే మన రైతులు ఆయా దేశాలకు వెళ్లి, ప్రకృతి విధానంపై శిక్షణనిస్తారని విజయకుమార్ చెప్పారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 10వ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



ప్లకార్డులతో ఎమ్మెల్యే శివకుమార్‌కు స్వాగతం పలుకుతున్న చేయూత లబ్ధిదారులు

తెనాలి అర్బన్: పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పించిదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 10వ వార్డు నాజర్‌పేట నుంచి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ 10వ వార్డు కౌన్సిలర్ తిరుమలశెట్టి సామ్రాజ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి శ్రీనివాసరావు సంయుక్త ఆధ్వర్యంలో వార్డు నాయకులు పెద్ద సంఖ్యల్లో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. 3800 వ్యాధుల్ని ఆరోగ్యశ్రీలోకి సీఎం జగన్ తీసుకురావడంతో పాటు నాడు-నేడు కింద వైద్యశాలల్ని మరింత అభివృద్ధి చేశారని తెలిపారు. గురువారం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు చెప్పారు. అందుకోసం ప్రత్యేక వైద్యుల బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పట్టణాలలో నూతనంగా డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేశారని గుర్తు చేశారు. తెనాలి పట్టణ పరిధిలో ఇప్పటికే రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు సేవలు ప్రారంభించాయని తెలిపారు. మిగిలినవి త్వరలో అందుబాటులోకి రానున్నట్లు ప్రకటించారు. 10వ వార్డులో ప్రజలు తెలియజేసిన సమస్యల్ని గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా సచివాలయానికి వచ్చే రూ.20లక్షలతో పరిష్కరించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, రాష్ట్ర భట్టరాజుల సంఘ కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లబండి సుష్మ, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తాడిబోయిన రామయ్య, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, కుర్రా సుజాత, కోమరబత్తిన జయపాల్, కొర్రా యశోద, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, 10వ వార్డు నాయకులు అంకమ్మరావు, గోడవల్లి వాసు, డేగల సుబ్బారావు, రాజా, మునునూరి నాగబసవేశ్వరరావు, వెనిగళ్ల గిరిప్రసాద్, దాసరి వాసు, పులగం నాగభూషణం, ముత్యాల పాండు, తులబందు శ్రీను, ఆకుల వెంకట్ పాల్గొన్నారు.

'బాబూజీ' రెండో షెడ్యూలు ప్రారంభం



తెనాలి: మాజీ ఉపప్రధాని జగ్జీవన్‌రామ్ బయోపిక్ 'బాబూజీ' సినిమా రెండో షెడ్యూలు బుధవారం తెనాలిలో ప్రారంభమైంది. తొలి షాట్‌ను బాలీవుడ్ నటి శ్వేత ఝా, అమీర్‌పై చిత్రీకరించారు. జగ్జీవన్‌రామ్ 115వ జయంతి సందర్భంగా స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపం ప్రాంగణంలో చిత్ర దర్శకుడు దిలీప్‌రాజా క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ప్రస్తుత షెడ్యూలు ఈ నెలాఖరు వరకు ఉంటుందని తెలిపారు. తొలి షెడ్యూలులో జగ్జీవన్‌రామ్, ఆయన కుమార్తె, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ పాత్రల్లో నటిస్తున్న మిలటరీ ప్రసాద్, తాళ్లూరి రామేశ్వరిపై తొలి షెడ్యూలులో కొన్ని సన్నివేశాల్ని తీసినట్టు దిలీప్‌రాజా గుర్తుచేశారు. నిజ జీవిత కథ కావడంతో మూలాల నుంచి సమగ్ర అధ్యయనంతో ఒక్కో షెడ్యూలును ప్లాన్ చేస్తున్నామని, వచ్చే ఏడాది విడుదల చేయాలనే తలంపుతో ఉన్నట్టు వివరించారు. కెమెరామెన్ వంశీ, ప్రొడక్షన్ మేనేజరు పినపాటి సురేష్‌బాబు, చిన్నికృష్ణ, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

రైల్వే గేటును పరిశీలించిన ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్

భట్టిప్రోలు: స్థానిక 277 రైల్వే గేట్‌ను రైల్వే శాఖ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రనాథ్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన ప్రత్యేక రైలులో రేపల్లె నుంచి తెనాలి వైపు వెళ్తూ భట్టిప్రోలు రైల్వే గేట్ వద్ద ఆపి గేట్‌మెన్ టి.వెంకటేశ్వరరావుతో మాట్లాడారు. గేటు పర్యవేక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట డీఆర్ఎం రామకృష్ణ, ఏడీఆర్ఎం శ్రీనివాస్, రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఉన్నారు.

రైల్వే అధికారులకు వినతిపత్రం

వేమూరు: రైల్వేశాఖ ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం పెనుమర్రు రైల్వేస్టేషన్ సమీపంలోని గేటును, ట్రాక్‌ను పరిశీలించారు. భద్రతాపరంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పెనుమర్రు స్టేషన్‌లో కొన్ని రైళ్లు ఆగడం లేదని వాటిని పునరుద్ధరించాలని వినతిపత్రం అందించారు. దీనికి స్పందించిన గుంటూరు రైల్వే డివిజనల్ అసిస్టెంట్ అధికారి సైమన్ మాట్లాడుతూ ప్లాట్‌ఫాంల మరమ్మతులు చేస్తున్నామని, అన్ని రైళ్లు నిలిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కుని పరారీ

పట్నంబజారు: పోలీసునని చెప్పి వ్యక్తిపై దాడి చేసి నగదు లాక్కొని పరారైన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఆర్టీసీ కాలనీకి చెందిన ఆవుల గురువారెడ్డి 4న రాత్రి వైజాగ్ వెళ్లి వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో దిగి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో రంగిశెట్టి ప్రవీణ్‌కుమార్ పూటుగా మద్యం తాగి తాను పోలీసునని భయపెట్టి గురువారెడ్డి వద్ద రూ. 600 లాక్కొని వెళ్లిపోయాడు. బాధితుడు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతడిపై గతంలో ఏడు చైన్ స్నాచింగ్, ఇతరత్రా చోరీ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


చెరువులో పడి మహిళ ఆత్మహత్య

ఐలవరం(భట్టిప్రోలు): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. భట్టిప్రోలు మండలం ఐలవరానికి చెందిన ఉద్దంటి లక్ష్మి కాంతం(55) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం రాత్రి గ్రామంలోని పైడమ్మ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మృతదేహం చెరువులో తేలియాడుతుండటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని బయటకు తీయడంతో లక్ష్మీకాంతంగా గుర్తించారు. మృతదేహాన్ని శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.


మిర్చి టిక్కీల చోరీ కేసులో నిందితుడి అరెస్టు

పట్నంబజారు: మిర్చి టిక్కీల చోరీ కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 2న ఏటుకూరు రోడ్డులోని శ్రీహరి కాటన్ జిన్నింగ్ మిల్లులో ఉన్న మిర్చి గోడౌన్‌లో పది మిరప టిక్కీలు చోరీ అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గుంటూరుకు చెందిన చినపాటి వందనం, చినపాటి రాకేష్, బి.హనుమంతు, తిరుమల బాలకృష్ణ, నలబోలు రవి, పడవల శ్యామ్‌కుమార్, మద్దెల అరుణను అరెస్టు చేసి వారి నుంచి రూ. 1.20 లక్షల విలువ చేసే మిర్చి టిక్కీలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



నాగేశ్వరరావు



కృష్ణారావు



ప్రజ్ఞపూర్ణాచారి

తెనాలి: తిరుపతిలో ఈనెల 9,10 తేదీల్లో జరగనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు పట్టణ, పరిసరాలకు చెందిన పలువురు కవులు, రచయితలకు ఆహ్వానం లభించింది. ఐఎస్ఓ గుర్తింపును పొందిన అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవాసంస్థ అయిన శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో, చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రెండురోజుల వేడుకల్లో కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు జరుగుతాయి. ఈ కార్యక్రమాలకు పట్టణానికి చెందిన కవి, ఆర్టీసీ ఉద్యోగి ఆళ్ల నాగేశ్వరరావు, రంగస్థల కళాకారుడు దేవిశెట్టి కృష్ణారావు, రూరల్ మండలం కొలకలూరుకు చెందిన నూతక్కి ప్రజ్ఞపూర్ణాచారికి ఆహ్వానం లభించింది. సాహితీ బ్రహ్మోత్సవాల్లో వీరు కవితాగానం, కళా ప్రదర్శన చేస్తారు.